# లక్ష్యం

"నీ పేరేమిటి?" జడ్జి సోమయాజి అడిగాడు.

"క్రీస్తురాజ్యం" చెప్పింది బోనులో నిల్చున్న ఆమె.

"నువ్వు నేరాన్ని అంగీకరిస్తున్నావా?" మళ్లీ అడిగాడు.

"అంగీకరించటం లేదు"

"ఇంతకు ఎప్పుడయినా నువ్వు నేరాన్ని చేశావా?"

"నేరం చేయడమంటే?" ప్రశ్నించింది క్రీస్తురాజ్యం.

సోమయాజి ఒక నిమిషం ఆగి క్రీస్తురాజ్యం మొహంలోకి తేరిపార చూశాడు. ఆమె మొహంలో ఆయనకు ఎలాంటి భావమూ కనపడలేదు. తెలివిమీద మాట్లాడుతున్నదానిలా అనిపించలేదు.

అప్పుడు పరిస్థితిని గమనించి ప్రాసిక్యూటర్ రంగంలోకి దిగాడు.

"క్రీస్తురాజ్యం..సేఠ్ చమన్‌లాల్ గారింట్లో నువ్వు ఆయన డైమండ్ రింగ్‌ను దొంగిలించినట్టుగా నీ మీద అభియోగం మోపబడింది. అందుకు నువ్వు కోర్టులో నీ సంజాయిషీ ఇవ్వాల్సి వుంటుంది" అన్నాడు స్పష్టంగా మాట్లాడి.

అప్పుడు క్రీస్తురాజ్యం అదోలా తేలిగ్గా నవ్వి ఇలా అన్నది. "అది కేవలం అభియోగం మాత్రమే. అందులో కొంచెం కూడా నిజం లేదు. నేను ఆ డైమండ్ రింగ్‌ని దొంగిలించలేదు. నేను మచ్చలేని దాన్ని. ప్రభువు మీద ఆన"

"ఆ సమయంలో ఆ గదిలో ఇంకెవ్వరూ లేరు. చమన్‌లాల్ స్నానం చేసి వచ్చేసరికి ఆ గదిలో డ్రెస్సింగ్ టేబుల్ మీద పెట్టిన రింగ్ మాయమైంది. దాన్ని తీసే అవకాశం నీకు మాత్రమే వుంది. కాబట్టి పరిస్థితులు నిన్ను దోషిగా నిర్ణయిస్తున్నాయి. నువ్వు బుకాయించి ప్రయోజనం లేదు. నువ్వు నేరం చేశావు" అన్నాడు ప్రాసిక్యూటర్ స్థిరమయిన గొంతుకతో.

క్రీస్తురాజ్యం మళ్లీ అదేవిధంగా నవ్వి నేను నేరస్తురాలినని మీరు ముందుగానే ఒక నిర్ణయం తీసుకున్నప్పుడు "నువ్వు నేరాన్ని అంగీకరిస్తున్నావా అని నన్ను అడగటం

ఎందుకు? అయినా నా సంజాయిషీ నేను ఇస్తాను. నేను ఆ గదిలో నుంచి బయటకు వచ్చిన తర్వాత అక్కడకు ఎవరు వచ్చారో నాకు తెలీదు? ఆ ఇంట్లో చాలామంది పనిచేసేవాళ్లు వున్నారు. వాళ్లల్లో ఎవరయినా ఆ రింగ్‌ను తీసుకుని వుండవచ్చు. కానీ సేఠ్ చమన్‌లాల్ గారు ఆ రింగ్‌ను నేనే దొంగిలించానని కేసు పెట్టడానికి నాకు తెలిసి ఒక కారణం వుంది" అన్నది.

"ఏమిటో కారణం?" సోమయాజి అడిగాడు.

"బావుండదేమో" అన్నది క్రీస్తురాజ్యం.

"సంశయించకు..చెప్పు..ఆ కారణం ఎలాంటిదయినా నువ్వు నిర్దోషివని తెలియజేయడానికి ఆ కారణం ఉపయోగపడవచ్చు.. చెప్పు రాజ్యం" అన్నాడు ప్రాసిక్యూటర్ ఆమెను ప్రోత్సహిస్తూ.

అప్పుడు క్రీస్తురాజ్యం నోరు విప్పింది.

క్రీస్తురాజ్యం చాలా అందంగా వుంటుంది. ఇంకా పెళ్లి కాలేదు. మంచి పరువంలో వుంది. మగాళ్లను కట్టి పడేసే అందం. కొంచెం నలుపయినా నున్నటి ఒళ్లు, నల్లని వొత్తయిన నొక్కుల జుత్తు. పుష్టిగా, బలంగా బరువయిన వక్షంతో కొంచెం పొడుగ్గా వుంటుంది. ఒకసారి ఆమెను చూసినవాళ్లు ఆమె మీద కోరిక పెంచుకోకుండా వుండలేరు. ఆమె అందం ముందు ఏ మగాడి నిగ్రహమూ పని చేయదు.

సోమయాజి కూడా ఆసక్తిగా చూస్తున్నాడు– క్రీస్తురాజ్యం వైపు ఆమె ఏం చెబుతుందో అని.

ఆ రోజు ఉదయం పది గంటలు దాటుతున్నప్పుడు చమన్‌లాల్ గారికి ఇంజెక్షన్ చేయడానికి వెళ్లాను. అప్పుడే స్నానం చేసి వచ్చిన ఆయన, నన్ను గదిలో కూర్చోపెట్టి బట్టలు వేసుకుని వచ్చారు. నేను ఇంజెక్షన్ చేయబోతున్నప్పుడు నా చేయి పట్టుకున్నాడు. విదిలించాను. ఒక్కసారి తన కోరిక తీర్చమని అడిగాడు. అలాంటి దాన్ని కాదని చెప్పాను. ఆయన విన్లేదు. ప్రాధేయపడ్డాడు. ఐనా నేను ఒప్పుకోలేదు. చివరకు డబ్బు ఆశ చూపించాడు. పెళ్లి కావలసిన దాన్ననీ, ఇటువంటి పనులు చేయనని ఆయనకు చెప్పాను. ఆయన వినకుండా మళ్లీ నా చేతిని పట్టుకున్నాడు. అప్పుడు నేను విసురుగా నా చేతిని లాక్కుని బయటకు పరుగుదీసి వెళ్లిపోయాను. దాని పర్యవసానమే ఈ దొంగతనం కేసు" అని కళ్లు తుడుచుకుంది క్రీస్తురాజ్యం.

ప్రాసిక్యూటర్ గొంతు సవరించుకొని "నువ్వు దొంగతనం చేశావనడానికి సరయిన సాక్ష్యం లేదు. కేవలం అనుమానం మాత్రమే. ఇప్పుడు నువ్వు చెప్పిన విషయం కూడా నమ్మశక్యంగానే వుంది. అందువల్ల నువ్వు ఈ నేరాన్ని చేయలేదని నమ్ముతూ ఈ కేసు కొట్టేసి నిన్ను నిర్దోషిగా విడుదల చేస్తున్నాను" అని ముగించారు.

సోమయాజి తీర్పు చెప్పగానే క్రీస్తురాజ్యం ముసిముసిగా నవ్వుకుంటూ వయ్యారంగా నడుస్తూ కోర్టు హాల్లోంచి బయటకు వచ్చింది. ఆమె వెళ్లటం చూసి చమన్‌లాల్ పరుగులాంటి నడకతో వచ్చి కారిడార్‌లో ఆమెను ఆపాడు.

"ఏమిటి?" అడిగింది క్రీస్తురాజ్యం

"పోనీ తీసుకుంటే తీసుకున్నావు గానీ దాన్ని నాకే అమ్ము. ఎందుకంటే అది నాకు బాగా కలిసొచ్చిన ఉంగరం. సెంటిమెంట్" అన్నాడు దీనమైన గొంతుతో.

క్రీస్తురాజ్యం విలాసంగా నవ్వి "ఆ ఉంగరాన్ని అమ్మగలనేమో గానీ తిరిగి అలాంటి ఉంగరాన్ని కొనలేను. అంత కెపాసిటీ నాకు లేదు. అటువంటి డైమండ్ రింగ్ మీద నాక ఎప్పటినించో మోజు వుంది. ఇప్పటికి తీరిందది. దాన్ని నేను వుంచుకుంటాను. రేపు నా పుట్టినరోజు, రేపు సాయంత్రం ఆరు గంటలకు నా స్నేహితులకు మా ఇంట్లో పార్టీ ఇస్తున్నాను. ఆ పార్టీలో ఆ డైమండ్ రింగ్‌ను పెట్టుకుంటాను. ఏమైనప్పటికీ మీకు థవుజండ్ థాంక్స్ అని బయటకు వెళ్లింది.

ఎందుకో తెలీదు గానీ చమన్‌లాల్ కళ్లు మెరిశాయి.

మర్నాడు సాయంత్రం ఆరున్నర కావస్తున్నప్పుడు క్రీస్తురాజ్యం ఇంటిముందు పొడవాటి కారు ఆగింది. అందులో నుంచి ముందుగా చమన్‌లాల్ తర్వాత జడ్జి సోమయాజి దిగారు. అప్పటికే అక్కడ కొన్ని మోటార్ వాహనాలు నిలిచి వున్నాయి. ఇంట్లోనుంచి సన్నగా ఏదో సంగీతం వినపడుతోంది.

ఇద్దరూ చిన్నగా నడిచి లోపలకు వెళ్లారు.

హాలులో అంతా సందడిగా వుంది. చాలామంది అతిథులు కుర్చీలో కూర్చుని కూల్‌డ్రింక్స్ తాగుతున్నారు. హాలంతా రంగురంగుల కాగితాలతో, దీపాలతో అలంకరించబడి వుంది.

క్రీస్తురాజ్యం అతిథుల మధ్య నిలబడి ఎవరో ఒక యువకుడితో నవ్వుతూ మాట్లాడుతోంది. ఆమె తలస్నానం చేసినందువలన జడ అల్లుకోకపోవడంతో పొడవాటి వంకీలు తిరిగిన కురులు ఫ్యాను గాలికి ఎగిరి నాట్యం చేస్తున్నాయి. ఎగురుతున్న కురులను సరిచేసుకోవటానికి క్రీస్తురాజ్యం కుడిచేతిని పైకెత్తింది. అప్పుడు ఆమె వేలికి వున్న వుంగరంలో రాయి తళుక్కున మెరిసింది.

ఆ దృశ్యాన్ని చూసిన చమన్‌లాల్ కళ్లు మళ్లీ మెరిశాయి.

జడ్జి సోమయాజికి ఆమె వేలికి వున్న వుంగరాన్ని చూపించాడు. అది బాగా మెరుస్తోంది.

"పదండి" అన్నాడు చమన్‌లాల్.

సోమయాజి, చమన్‌లాల్ మెల్లగా నడుస్తూ క్రీస్తురాజ్యం దగ్గరకు వెళ్లారు.

క్రీస్తురాజ్యం జడ్జి సోమయాజిని గుర్తించి నమస్కారం చేసి తన పుట్టినరోజు పార్టీకి వచ్చినందుకు సంతోషాన్ని వ్యక్తపరిచి వాళ్లిద్దరినీ అక్కడ ఖాళీగా వున్న కుర్చీలో కూర్చోమని చెప్పి డ్రింక్స్ తీసుకురమ్మంది.

"మేం పార్టీకి రాలేదు. ఒక పని నిమిత్తం వచ్చాము. ఇంతకీ చమన్‌లాల్ ఇంట్లో నువ్వు దొంగిలించిన డైమండ్ రింగ్ ఇదేనా?" అనడిగాడు సోమయాజి.

క్రీస్తురాజ్యం ఆయనలా అనగానే నవ్వి "మీరింకా నన్ను దొంగగానే అనుకుంటున్నారా? అయితే నిన్న మీరిచ్చిన తీర్పు మాట ఏమిటి? ఇది డైమండ్ రింగ్ కాదు. కావలిస్తే మీరే చూడండి" అంటూ వేలికున్న మెరుస్తున్న ఉంగరం తీసి సోమయాజికి ఇచ్చింది.

ఆయన దాన్ని తీసుకొని అటూ ఇటూ తిప్పుతూ పరీక్షగా చూసి నవ్వి "నిజమే ఇది డైమండ్ కాదు. ఇందులో గోల్డు లేదు. తక్కువ రకం 'అమెరికన్ డైమండ్'లా వుంది. ఇమిటేషన్ జ్యూయలరీ ఉంగరం. నువ్వు దొంగవు కాదు. సారీ క్రీస్తురాజ్యం" అని చమన్‌లాల్ వైపు తిరిగి మనం వచ్చిన పని అయిపోయింది. ఇక వెళదాం అని వెనుదిరిగారు జడ్జి. చమన్‌లాల్ మౌనంగా ఆయన్ని అనుసరించాడు.

అప్పుడు క్రీస్తురాజ్యం పకపకమని నవ్వి "నువ్వొట్టిఫూల్‌వి. విలువైన వస్తువుని కాపాడుకోవడం నీకు తెలీదు. అందుకే డైమండ్ రింగ్‌ని పోగొట్టుకున్నావు. నేను నీలా కాదు ఇలా జరుగుతుందని నాకు ముందే తెలుసు. నేను బర్త్‌డే పార్టీలో ఆ డైమండ్‌రింగ్‌ని పెట్టుకుంటానని చెప్పినప్పుడు నీ కళ్లలో మెరుపుని పసిగట్టాను. అందుకే ఉదయం మూడొందలు పెట్టి ఈ ఇమిటేషన్ జ్యూయలరీ రింగ్‌ను కొన్నాను. అసలు రింగ్‌ను దాచివుంచి ఈ రింగ్‌ను పెట్టుకున్నాను. నువ్వు కూడా ఇలాంటి రింగ్‌ను కొనుక్కో. సేఫ్టీ ఎక్కువ. నర్సు ఉద్యోగం చేస్తున్నా నాకు నీకంటే ఎక్కువగానే బ్రెయిన్ పని చేస్తోంది. ఈ డైమండ్ రింగ్ నా బర్త్‌డే ప్రజెంటేషన్ అనుకుంటాను. ఏమైనప్పటికీ నీ ఆశాభంగానికి సారీ. ఎట్టాగూ వచ్చావు కదా..ఒక డ్రింక్ తాగి వెళ్లు.." అని మళ్లీ నవ్వింది క్రీస్తురాజ్యం.

చమన్‌లాల్ పిచ్చిపిచ్చిగా చూసి మాట్లాడకుండా ఏడుపుమొహంతో వెళ్లిపోయాడు.

"ఏమంటుంది క్రీస్తురాజ్యం?" తనని కలిసిన చమన్‌లాల్‌ని అడిగాడు సోమయాజి.

క్రీస్తురాజ్యం మనకంటే చాలా తెలివైనది" అన్నాడు చమన్‌లాల్, అంతకుమించి ఏమీ చెప్పలేదు.

(గృహకల్ప పక్షపత్రిక 15-31 జనవరి 2010)